# జాతరలో వేషధారి

మధురాంతకం నరేంద్ర



నాకు మెలకువ వస్తోండగా అలారం మోగిందో, లేకపోతే అలారం మోగుతోండగా నాకు మెలకువ వచ్చిందో సరిగ్గా తేల్చి చెప్పలేను. అయితే అలారం మోగకపోయినా నాకా సమయానికి మెలకువ వచ్చి వుండేదని మాత్రం కచ్చితంగా చెప్పగలను. అనుకున్న సమయానికి మెలకువ వచ్చేలా శరీరాన్ని తయారు చేసుకున్నాన్నేను. కానీ వొకవేళ ఆదమరచి నిద్రపోతే?

యిసుకలో తలదూర్చి ప్రపంచమంతా నిద్రపోతోందనుకునే నిప్పుకోడిలాంటి వాడినికాను నేను. నేను నిద్రపోతున్న సమయంలో యెవరైనా మేలుకోవచ్చు. నా గదిలోకి తొంగి చూడవచ్చు. అందుకే నా జాగ్రత్తలో నేనున్నాను. రాత్రి నిద్రపోయేముందు కిటికీలు మూసేసి, దీపాన్ని ఆర్పేసానంటే, యిక నేను నిద్రలేచి తలుపులు తీశాకే వెలుతురు లోనికి రావాలి. నా అనుమతి లేకుండా నా గదిలో దీపాలు వెలిగించకూడదనీ, కిటికీలు తెరవకూడదనీ నా పెళ్లాన్ని శాసించాను.

"ప్రొద్దున్నే మీకంటే ముందుగాలేచి ఆపనీ యీపనీ చేసుకోకపోతే మిమ్మల్ని సమయానికి ఆఫీసుకెలా పంపగలను? గంట కొట్టకమునుపే పిల్లలు బడికెళ్లాలిగదా!" అంటూ అది ప్రాధేయపడింది. పదే పదే బ్రతిమాలించుకున్న తర్వాత "బయట వెలుతురు రాకమునుపే నువ్వు నిశ్శబ్దంగా లేచి, గది తలుపుల్ని కొద్దిగా తెరిచి, లోపలికి తిరిగి నాకేసి చూడకుండా వెళ్లిపోవాలి. మళ్లీ తలుపులు గట్టిగా మూసేయాలి. నేను నిద్ర పోతున్నాను గదా అనుకుని తిరిగి చూశావంటే నేనూరుకోను. నీ కళ్లకు నిద్రపోతున్నట్టే కనిపిస్తాను గానీ, నేను



మేలుకునే వుంటాను, జాగ్రత్త!" అని నా శాసనాన్ని కొంచెం సడలించాను.

వొకటి రెండుసార్లు కావాలనే ముందుగా మేలుకుని, తలుపులు తెరిచి వెళ్లిపోబోయే ముందు నా పెళ్లాం నాకేసి చూస్తుందేమోనని పరీక్షించి చూశాను. నా ఆజ్ఞను జవదాటే ధైర్యం దానికి లేదని నాకు బాగా తెలుసు అలాగని గుడ్డిగా నమ్మగూడదు కదా!

అలారం మ్రోత ఆగిపోయిన తర్వాత గూడా కాస్సేపు పడకపైన పొర్లాను. బాగా నిద్ర తేలిపోయిన తర్వాత మంచం కిందికి చేయిచాపి నా రహస్యపు బుట్టను బయటికి లాగాను. బుట్టలోని సరంజామాపైన చేయిపెడితే దొరికేలాగా ముందుగా జాగ్రత్తగా సర్దుకున్న గోముఖాన్ని తీసి భద్రంగా నా ముఖానికి తగిలించుకున్నాను. చీకట్లోనేవోసారి ముఖానికి తొడుగు సరిగా తగిలించుకున్నానో లేదో జాగ్రత్తగా తడిమి చూసుకున్నాను. ఆ తర్వాత పడక పక్కనున్న బెడ్‌స్విచ్‌ని నొక్కాను.

భళ్లున దీపం వెలిగింది.

పైకి లేచి కూర్చున్నాను.

యెదురుగా గోడకు వేలాడుతున్న అద్దంలో నాగోముఖం అందంగా వినయంగా, పొందికగా కనిపించింది. కానీ కుడివైపు చెవిదగ్గర తొడుగు కొంచెం పైకి లేచినట్టు కనిపిస్తోంది. అదిగూడా సర్దుకున్నాక రహస్యపు బుట్టనోసారి సర్దుకుని, నా సరంజామానంతా కాగితం పూలగుత్తులతో కప్పేశాను. అత్తరు సీసా తీసి గుమ్మెత్తి పోయేలా కాగితం పూలపైన స్ప్రే చేశాను. యిక వీటిని కాగితం పువ్వులని యెవరనుకోగలరు?

రాత్రి పడుకునే వరకూ యీ రహస్యపు బుట్ట నా భుజానికి వ్రేలాడుతూనే వుంటుంది. స్నానం చేసేటప్పుడూ, దుస్తులు మార్చుకునేటప్పుడు మాత్రం భుజంపైనుంచీ తీసి పక్కనుంచుకుంటాను.

నేను గది బయటికిరాగానే "పిల్లలూ, నాన్నగారు నిద్రలేచేశారు. ఆయన స్నానం చేశాకే మీకు......." అంటూ కేకేసింది నా పెళ్లాం.

పిల్లలు బాత్రూం నుంచీ బయటికొచ్చేశారు.

కాలకృత్యాలూ, స్నానమూ ముగించుకుని బయటికొచ్చేదాకా వాళ్లు బయటే కాచుకుని వున్నారు.

> దశాబ్దాలు గడిచే కొద్దీ రాజకీయ, వైజ్ఞానిక, సామాజిక రంగాలన్నింటి పరివర్తనలో అనూహ్యమైన మార్పులు చోటుచేసుకుంటాయి. ఈ మార్పులన్నీ మనిషి జీవనగతిపై ఆలోచనా రీతిపై ప్రభావం చూపిస్తూనే ఉంటాయి.
>
> సమాజంలో, మానవ జీవితంలో వచ్చిన మార్పులే రచయితల భావసరళిని, ఆలోచనా శక్తిని ప్రభావితం చేస్తాయి. తత్ఫలితంగా రచయిత ఎన్నుకొనే ఇతివృత్తం మారుతుంది. సమస్యల స్వరూపం మారుతుంది. రచనా సంవిధానం మారుతుంది. ఏది మారినా మౌలికమైన సాహిత్యపు విలువలు, జీవితపు విలువలు మారవు. మారని ఈ విలువలున్న కథైనా, నవలైనా మరే ఇతర రచనైనా అది ఈతరం రచయిత రచించినదైనా గానీ సాహిత్యాభిమానుల ఆదరణను చూరగొంటుంది. కాలాతీతమైన విలువల్ని ఆవిష్కరిస్తుంది. అందులో సందేహం లేదు. ఈ విలువల్ని ఎత్తిచూపే ప్రయత్నంలో భాగంగా ఈనాటి కథకుల విలువైన రచనల్ని ఆహ్వానం మీకు అందిస్తోంది.

నే నొచ్చేశాక బాత్రూంలోకి పరిగెత్తారు. నా పెళ్లాం సిద్దంచేసి పెట్టిన బట్టలు తొడుక్కుని, దినపత్రికను చేతబట్టుకుని డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నాను.

టిఫిన్ ప్లేటు నా ముందుంచుతూ "యీ కాస్సేపయినా నాతో కబుర్లు చెప్పకూడదా?" అంటూ నా పెళ్లాం గారాలు పోయింది.

నిజానికి నాకు దినపత్రిక వార్తలపైన నమ్మకమెప్పుడూ లేదు. చదవాలన్న వుత్కంఠ సైతం వుండదు. కానీ కబుర్లు చెబుతూ తీరిగ్గా టిఫిన్ చేస్తే నా పెళ్లామేమనుకుంటుంది? నేనెంత తీరిక లేకుండా తిరుగుతున్నానో దానికెలా తెలుస్తుంది? కానీ యివ్వాళెందుకో దాని ముఖం చూస్తే జాలి కలుగుతోంది. వో క్షణం పాటు ముఖాన్ని మార్చేసుకుందామని గూడా అనుకున్నాను. కానీ యిలాంటి సమయాల్లోనే జాగ్రత్తగా వుండాలన్న విషయం గుర్తుకొచ్చింది. రెండు ముద్దలు గబగబా మింగుతూ, వో కంట పత్రిక చదువుతున్నట్టే చూస్తూ "గమనిస్తూనే వున్నావుగదా సతీ! యీ సమయంలో తప్పితే మరి పేపరు చదివే సమయమే దొరకదు. నేను క్షణమైనా విశ్రాంతి తీసుకోకుండా పనిచేస్తున్నప్పుడే గదా మన సంసారం సాఫీగా సాగిపోయేది?" అన్నాను.

నేను పత్రికను తిప్పుతూ టిఫిన్ తింటూండగానే నా పెళ్లాం నా పాదాలకు మేజోళ్లూ బూట్లూ తొడిగింది.

స్నానం చేసి, టవలు చుట్టుకుని బయటికొచ్చిన నా కొడుకు "నాన్నగారికి పదికి గదా ఆఫీసు? నేను తొమ్మిదిగంటలకంతా బడికెళ్లాలి......" అంటూ నాకేసి అసహనంగాచూస్తూ నిలబడ్డాడు.

"ఆఫీసు పదికే అయినా, నాన్నగారు యెనిమిదికంతా వెళ్లిపోవాలి. ఆయన దగ్గరుండి చూసుకోకపోతే ఆఫీసులో చీమ యినా సరిగ్గా చిటుక్కుమనదు తెలుసా?" అంది నా పెళ్లాం.

"నిన్న సాయంకాలం మా ఆఫీసరు గసబోసుకుంటూ నా దగ్గరికి పరిగెత్తుకొచ్చాడు సతీ!" వాళ్ల మాటల్ని వినిపించుకోనట్టుగా చెప్పడం మొదలుపెట్టాన్నేను-- "మరేం భయంలేదు, కాస్సేపుకూర్చుని, నీళ్లుతాగి, తేరుకున్న తర్వాతే సమస్యేమిటో చెప్పమన్నాను. కాస్సేపు విశ్రాంతి తీసుకున్న తర్వాత 'సార్! యీ సమస్యొకటి యెంతకూ పరిష్కారమవడంలేదు. మీరే గట్టెక్కించాలి' అన్నాడు. చెప్పమని నేను అభయహస్తం చూపించాను. అప్పుడతనన్నాడూ-- 'సార్! టీ బ్రేక్‌లో మనం కాఫీలు తాగుతున్నాంగదా? టీబ్రేక్ అంటే టీలు మాత్రమే తాగమని గదా అర్థం? కాఫీలు తాగడం ఆఫీసురూల్సుకు విరుద్దంగాదా? యిది బ్రీచ్ ఆఫ్ ఆఫీసియల్ ప్రొసీజర్ కదా?' అన్నాడు."

ఆమెలో వుత్కంఠను రేకెత్తించడం కోసం నేను మాట్లాడడం ఆపిన సమయంలో "నిజమేనే! పెద్ద సంకటమేనే?" అంది నా పెళ్లాం.

"నాకూ వో నిముషంసేపు యేం చేయాలో తోచలేదు. యింతలో టక్కున అయిడియా వచ్చేసింది. 'సైన్సు ప్రకారం టీ కంటే కాఫీ తక్కువ హానికారి. కాబట్టి ఆఫీసు వుద్యోగుల శ్రేయస్సుదృష్ట్యా కాఫీనే రెకమెండ్ చేస్తున్నాం- అని ఫుట్‌నోట్సు రాసేద్దాంలెండిసార్!' అన్నాను. మా ఆఫీసరు అలాగే చేతులు జోడించేశాడు తెల్సా?" అంటూ కళ్లెగరేశాను.

"తప్ప టీ కంటే కాఫీనే యెక్కువ

చెడ్డది. మామేడం చెప్పింది. అసలు రెండు తాగకూడదు. పాలే తాగాలి......" నా వైపుకు యింకా అసహనంగానే చూపుల్ని సారిస్తూ కత్తిజళిపించినంత కరుగ్గా అన్నాడు నా కొడుకు.

"ఆపాడు స్కూల్లో అన్నీ తప్పులే చెబుతున్నారు. వీడిని వేరే స్కూల్లో చేర్పించాలండీ" అంటూ నా పెళ్లాం వాడి చెవిమెలిపెట్టింది. చాలనిదానికి "నాన్నగారికంటే మీ మేడంకు యెక్కువ తెలుసుననుకుంటున్నావ్రా బడుద్దాయ్!" అని నాలుగు చీవాట్లుకూడా తగిలించింది.

వాడి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. కానీ వాడు యేడవలేదు.

వాడ్నీ, వాడి ఛట్టుదలనీ చూస్తుంటే నాకు భలే ముచ్చటేసింది, భయంగూడానూ! పోలికలు తనవీ, గుణాలు నావీ వచ్చాయంటుంది నా పెళ్లాం. చిన్న చిన్న అవగుణా

వాళ్లు స్పృహలోకి రారని తెలుసు. నా ముఖాన్ని మార్చుకోడానికి నాకా సమయం చాలు. గో ముఖాన్ని బుట్టలో వుంచేసి గుర్రం ముఖాన్ని తీసి తగిలించుకున్నాను. జేబులోంచి అద్దంతీసి సరిగ్గా తగిలించుకున్నానో, లేదో పరీక్షించి చూసుకున్నాను. లేతగా, నాజూకుగా, హుందగా, అందంగా వుంది నా గుర్రం ముఖం.

నావైపే చూస్తూ ఆఫీసు బ్రీఫ్‌కేసు తీసుకొచ్చియిచ్చింది నా పెళ్లాం తన వస్తువు నెవరైనా దోచుకెళ్లిపోతారేమోనన్న భయం దాని కళ్లల్లో స్పష్టంగా తొంగి చూస్తోంది. నేను సంతృప్తిగా యింటి బయటికొచ్చేశాను.

ముందుగా పొట్టి మిత్రుడి యింటికి దారితీశాను.

పొట్టిగా, సన్నగా, బలహీనంగా వున్న

స్నేహితుడనని నన్ను చాలామంది గౌరవిస్తూ వుంటారు. పైగా నా పెళ్లానికి గూడా వీడిమాటలంటే బాగా గురి. రోజూ వో అయిదు నిముషాలు భరిస్తే యేం పోతుంది?

"నాలుగైదు రోజులుగా కనిపించలేదేందుకు?" అంటూ విచారణ మొదలుపెట్టాడు వాడు.

"ఆఫీసులో చెప్పలేనంత పని" అన్నాను.

వాడు అనుమానంగానే చూస్తూ "ఆఫీసూలేదు, గీఫీసూ లేదు. రోజూ ఆపాడుగు వాడితో కలిసి జల్సాలు చేస్తున్నావు. అవునా కాదా?" అని నిలదీశాడు.

లాభంలేదు. వీణ్నియిలా నమ్మించలేం.

బుట్టలోంచీ వో పువ్వు తీసి వాడికిచ్చాను.

వాడు వాసన పీల్చుకుని మైమరచిపోయిన సమయంలో గబగబా గుర్రంతల

'ఆహ్వానం' ప్రచురించే విలువైన క్రొత్తకథల విశ్లేషణలో పాఠకుల్ని, రచయితల్ని పాల్గొన వలసిందిగా కోరుతున్నాం. తమ అభిప్రాయం సంక్షిప్తంగా, సమీక్షాత్మకంగా రాసి పంపితే ఎన్నిక చేసిన వాటిని ప్రచురించటమేగాక 50 రు. పారితోషికం కూడ పంపుతాం.

—ఎడిటర్

లున్నాయనుకోండి. కానీ పిల్లవెధవగదా! పెద్దవాడైతే అన్నీ నేర్చుకుంటాడు.

"నా ముందు పిల్లల్ని కొట్టద్దన్నానా!" అంటూ పెళ్లాన్ని గదమాయించాను.

"చూశావా, మీరంటే నాన్నగారికెంత యిష్టమో!" అంది నా పెళ్లాం.

తన స్నానం ముగించి బయటికొచ్చిన నా కూతురు దగ్గరికొచ్చి నా బుగ్గపైన ముద్దుపెట్టింది.

"చిన్నదానికున్నంత మట్టూ మర్యాదా వీడికి లేవుగదా!" అంటూ నా పెళ్లాం నా కూతుర్ని ముద్దుపెట్టుకుంది. దానికి నా అందమూ, తన తెలివితేటలూ వచ్చాయని అంటూంటుంది నా పెళ్లాం.

"అమ్మా! నిన్న మనింటికొచ్చిందే, నా ఫ్రెండు దానికి నాన్నగారి ఫోటో చూపెడితే, మీ అమ్మకు తమ్ముడా అని అడిగిందే!" అంది నా కూతురు.

"యెవతే అది? దాన్నీ......" ఓ క్షణం పాటూ నా పెళ్లాంలో వుడుకుమోత్తనం కనిపించింది. అంతలో తేరుకుని "నన్ను చూస్తే దానికి గూడా అసూయేనా?" అంది.

చేయి కడుక్కుని నా బుట్టలోంచీ మూడుపువ్వుల్ని తీసి ముగ్గురికీ యిచ్చాను. ముగ్గురూ ముక్కులదగ్గరుంచుకుని వాసన చూశారు. దాదాపు వొక నిముషం సేపు

వాడి శరీరాన్ని చూస్తేనే నాకు నవ్వొస్తుంటుంది. బాగా పాతబడిన తీవాచీనొకదాన్ని పరుచుకుని, కాగితాలూడిపోయిన పుస్తకాల్లో తలదూర్చుకుని కూర్చుని వున్నాడతను. వెనక గోడకు రంగులు వెలసిన చిత్రమొకటి వేలాడుతోంది. గోడవారగా విరిగిన విగ్రహమొకటి కనిపిస్తోంది. యీ పాత పనికిరాని వస్తువుల్ని గిరవాటేయమంటే వాడు వినిపించుకోడు. పైగా అవి తయారుచేసిన వ్యక్తుల్ని గురించీ, వాటి గొప్పతనాల్ని

> బుట్టలోంచి పువ్వొకటి తీసి వాడికిచ్చాను. వాడు వాసన పీల్చి మైమరచి పోయిన సమయంలో గబగబా గుర్రం తలను తీసి రహస్యపు బుట్టలో దాచి అందులో నుండి గాడిద ముఖాన్ని తీసి తగిలించుకున్నాను.

గురించీ వుపన్యాసాలు కొనసాగిస్తాడు. వినే వోపికెవరికుంది? కానీ యే మాట కామటే చెప్పుకోవాలి. యిలాంటి వాడి

నుతీసి రహస్యపు బుట్టలోదాచేసి, అందులోంచీ గాడిద ముఖాన్ని తీసి తగించుకున్నాను.

మత్తు తగ్గిన తర్వాత అరమోడ్పుకళ్లతో చూస్తూ "నిజమేలే! దున్నే యెద్దునేకదా కడతారు?" అన్నాడు వాడు.

"నీతో యెంతసేపు గడిపినా తనివితీరదు. కానీ యేం చేయను చెప్పు. తీరిచావదు. ఆఫీసుకెళ్లాలిమరి........" లేచి నిల్చున్నాను.

"రేపు కలుస్తావు గదా! ప్రామిస్.........."

"తప్పకుండా కలుస్తాను. అన్నట్టు చెప్పడం మరచాను. మా వాడికి స్కూల్లో పాఠాలు సరిగ్గా చెప్పడంలేదు. యిలాంటి వ్యవహారాలు నీకైతే బాగా తెలుస్తాయి గదా! వోసారి వాడి బడికెళ్లి వాణ్ణి మరో సెక్షన్లోకైనా మార్పించు........"

వాడి సమాధానం వినబడక మునుపే రోడ్డుపై కొచ్చేశాను. నేను కాలితో చేయమన్న పనిని వాడు చేతితో చేస్తాడు. చదువు సంధ్యల సంగతైతే యిక చెప్పాల్సిన పనేలేదు. సాయంకాలంలోపల ఆ పని ముగించి, మా యింటికెళ్లి, నేను యింట్లో లేకపోయినా నా పెళ్లానికి వర్తమానమందించి, అదిచ్చే కాఫీతాగి, ఆ తరువాతే

అంతర్జాతీయఖ్యాతి నార్జించుకొన్న తెలుగుకథ ఈనాడు వ్యాపార విలువలకు బలైపోతున్నదని, మంచి కథలకు కొరత ఏర్పడుతున్నదని కథకులు, కథా వేదికలవారూ గొడవ పెట్టేస్తున్నారు. నిజమేకావచ్చు. కానీ, కథకులు ఆర్థిక ప్రలోభాలకు, అర్థంలేని ప్రచారకాంక్షకు అమ్ముడుపోకుండా తమ నిజాయితీని నిలుపుకుంటూ సమాజం పట్ల ఆర్తితో, అవగాహనతో రాసే కథకుల కథలకు 'ఆహ్వానం' పలికే పత్రికలు లేకపోలేదనే విషయం ముందు గుర్తించి, ఇటువంటి పత్రికలకు తమ సహకారం అందించటం ద్వారా తమ వంతు బాధ్యతను నిర్వర్తించమని కోరుతున్నాం.

—ఎడిటర్

వాడు మరో పనిని గురించి ఆలోచిస్తాడు. నాకా సంగతి బాగా తెలుసు.

నడుస్తున్న నా పాదాలెందుకో కదలనని మొరాయించసాగాయి. పరధ్యానంగా నడుస్తున్న నేను వులిక్కిపడి చుట్టూ కలయజూశాను. యెదురుగా నా పొడుగు మిత్రుడి యిల్లు కనిపించింది.

పడకపైన గాఢ నిద్రలో కనిపించాడు వాడు. పొడవుగా, లావుగా, బలంగా వున్న వాడి శరీరం కొండ గుహలో నిద్రపోయే చిరుతపులిని గుర్తుకు తెస్తోంది. నాలుగైదు సార్లు కుదిపిన తర్వాత గానీ వాడు కళ్లు తెరిచాడుకాదు. "నిన్న అడివిలో కెళ్లాం గదా! భలేఖుషీగా గడిపాంలే! వొళ్లంతా వోవరాయిలింగ్ చేసినట్టయిపోయిందనుకో" అంటూ వాడు ఆవులించాడు.

"అయ్యో! నా అదృష్టం బాగున్నట్టు లేదు. అందుకే రాలేకపోయాను" అంటూ వాపోయాన్నేను.

"నువ్వెందుకొస్తావురా! ఆ పొట్టివాణ్ణి చూస్తే నీ కొళ్లు తెలియదు. వాడితో నే వూరేగి వుంటావు......"

"నన్నపార్థం చేసుకుంటున్నావు. వాడో పిచ్చి వెధవ. యేదో కాలికీ చేతికీ పనికొస్తాడు గదా అని యెప్పుడో తీరిక దొరికినప్పుడు వెళ్లి పలకరిస్తూ వుంటాను. అంతేగానీ, వాడంటే నాకు ప్రత్యేకమైన అభిమానమేమీ లేదు......."

వాడు అనుమానంగానే చూడసాగాడు.

యిక లాభం లేదనుకుని, బుట్టలోంచీ వో పువ్వుతీసి వాడికిచ్చాను. అత్తరువాసన వాణ్ణి మత్తులో కట్టిపడేసిన రెండుమూడు నిముషాలు చాలు నాకు. ఆ వ్యవధిలో నాపైనున్న గాడిదతల మాయమైపోయి, దానికి బదులుగా తోడేలుతల ప్రత్యక్షమైపోయింది.

మత్తులోంచీ బయట పడిన తర్వాత నాకేసి సంతృప్తిగా చూస్తూ "యీ అరకొర మార్పులవల్ల సుఖంలేదురా! నిన్న అడివిలో కొచ్చి వుంటే నీకే అర్థంమైవుండేది. యీ నగరాల్లో యేముంది? బూడిద అడవిలో, ప్రకృతిలో కలిసిపోయి, అస్తిత్వాన్నే మర్చిపోతే, వాహ్, ఆసుఖమే సుఖం....." అన్నాడు వాడు.

"యేం చెయ్యను నేస్తం? భార్యాపిల్లలూ, బరువు బాధ్యతలూ వున్నవాణ్ణి. వుద్యోగం చెయ్యకపోతే తప్పుతుందా చెప్పు? అప్పటికీ వున్న సెలవులన్నీ నీ కోసమే గదా వాడేశాను......"

"నీ వుద్యోగం సంగతీ, నీ సెలవు లగొడవా నాకొద్దు. రేపు పెద్ద విందు యేర్పాటు చేశాను. వూరికి మధ్యలో పెద్ద పాతకాలపు మేడొకటుంది. ఆ వీధిలో యెన్నోసార్లు తిరిగే వుంటావునువ్వు. కానీ అక్కడలాంటి యిల్లొకటుందని అనుకొనుండవు. అందులో వొక పెద్దాయనున్నాడు. అవసరమైనప్పుడల్లా అడవికెళ్లడం కష్టంగా వుందంటే, నాకోసమని అక్కడి కక్కడే వొక అడవిని తయారు చేసి యిస్తానని హామీ యిచ్చాడు. మేము వెళ్తున్నాం. వస్తే సుఖపడతావు. లేకపోతే నీ కర్మ...." అంటూ మరోసారి బిగ్గరగా ఆవులించాడు వాడు.

"నువ్వంతగా చెప్పాలానేస్తం! నువ్వు పిలిస్తే నేను రానని యెప్పుడైన చెప్పానా? నువ్వు బాగా అలిసిపోయినట్టున్నావ్. విశ్రాంతి తీసుకో రేపు కలుద్దాం......"

వాడి యింటినుంచీ కదలనని మొరాయిస్తున్న కాళ్లను బలవంతంగా ముందుకు కదిపి, బరువుగా అడుగులు సారిస్తూ ఆఫీసు చేరాను.


హాలులో కూర్చుని పనిచేసుకుంటున్న నాకింది వుద్యోగులందరూ అదోలా నవ్వుతూ నమస్కారాలు చేశారు. గోడ గడియారం టంగుటంగుమని కొట్టినప్పుడు గానీ వాళ్ల నవ్వులకు అర్థమేమిటో స్ఫురించింది గాదు. నేను బాగా ఆలస్యంగా ఆఫీసుకొచ్చానన్న మాట! అయినా అడిగే ధమ్ములెవరికున్నాయి?

నా సంతకాల కోసం ఫైళ్లు మోసుకొచ్చిన పడుచు గుమాస్తావొకడు "యీ సంతకంకోసం అవతల వో పెద్దమనిషి ప్రొద్దుటినుంచీ వేచి చూస్తున్నాడు పాపం!" అంటూ సాగదీశాడు.

అంటే నేను ఆలస్యంగా వచ్చానన్న విషయాన్ని వీడు జ్ఞాపకం చేస్తున్నాడన్న మాట! యెంత ధైర్యం వీడికి? అప్పుడుగాని నేనింకా తోడేలు తలతోనే వున్నానని తోచలేదు. లాభంలేదు, వెంటనే తలమార్చుకోవలసిందే! అందరూ చూస్తూవుండగా మార్చుకోవడం కుదరదుగదా? వీళ్లదృష్టి మరల్చాలంటే తలావొక పువ్వు సమర్పించుకోవలసిందేనా? యిలా యెదురుపడ్డ ప్రతి వాడికీ పంచిపెట్టడానికి పూలచలివేంద్రం పెట్టానా నేను? మరేం పర్వాలేదు. వీళ్ల మోహాలకు పూలుగూడానా?

"అందరూ జాగ్రత్తగా వినండి. రెండు నిముషాల సేపు అందరూ వెనుదిరిగి కూర్చోండి," అని ఆజ్ఞాపించాను.

కిక్కురు మనకుండా అందరూ వెనుదిరిగి కూర్చున్నారు.



"నేను చెప్పేవరకూ తిరిగి చూడకూడదు. యెవరైనా తిరిగి చూశారో, వాడిని సస్పెండ్ చేసేస్తాను." అంటూ మరోసారి హెచ్చరించాక తోడేలు తలతీసి బుట్టలో వుంచేసి, సింహంతల తీసి తగిలించుకున్నాను.

"యిప్పుడు వెనుదిరిగి, బుద్ధిగా వొళ్లు దగ్గర పెట్టుకుని పని చెయ్యండి. నా దగ్గర తోకతిప్పితే వూరుకోను......." అంటూ హుంకరించాను అందరూ ఫైళ్లలోకి తలలు దూర్చేశారు.

యింతలో లంచవర్ వచ్చేసింది.

నా కింది వుద్యోగులందరూ వాళ్లకారియర్లు తీసుకొచ్చి నా ముందుంచారు. వాకో గిన్నెలోంచీ వాకోముద్ద రుచి చూశాను. దాంతోనే కడుపు నిండిపోయింది నాకు. యిక అందరూ భోంచేయవచ్చునన్న అనుమతిని ప్రసాదించి నా సీటులో సారిగిల బడ్డాను. ప్రొద్దుటినుంచీ తిరిగీ తిరిగీ వేసారి పోయేనేమో, నిద్ర ముంచుకొచ్చింది. అలా యెంత సేపు కునుకులో మునిగిపోయానో, నాకే తెలియదు. మెలకువ వచ్చి కళ్లు తెరిచి చూసేసరికి కుర్ర గుమాస్తా యెదురుగా కనిపించాడు. "మీరు లేవగానే ఆఫీసరుగారు తననోసారి కలవమని చెప్పారండీ!" అంటూ వినయంతో వొదుగుల్లు పోయాడువాడు.

నేనోసారి బిగ్గరగా ఆవులించి, లేచి ఆఫీసరు గదిలోకి వెళ్లాను.


మా ఆఫీసరు నన్నోసారి యెగాదిగా చూస్తూ "మన ఆఫీసులో వుద్యోగాలు క్రమశిక్షణను గురించి మీతో చర్చించాలని పిలిచానండీ......" అన్నాడు.

"చెప్పండిసార్!" కుర్చీని ముందుకు లాగి కూర్చుంటూ అన్నాను.

అతనోసారి యిబ్బందిగా అటూయిటూ కదిలి, "అందరూ సక్రమంగా పనిచేస్తున్నట్టేనా?" అని అడిగారు.

"మీకా సందేహమే అవసరంలేదండీ! హఠాత్తుగా వూడిపడినప్పుడుగానీ వాళ్లేంచేస్తున్నారో మనకు తెలియదు గదా? యీ రోజుకావాలని నేను ఆఫీసుకు ఆలస్యంగా వచ్చాను. అందరూ శ్రద్ధగా పని చేసుకుపోతున్నారు." అని సమాధానం చెప్పాను.

"అది సరేననుకోండి.....మరైతే..... మీరు......యిప్పుడు......" నీళ్లు నమలసాగాడతను. అప్పుడు గానీ తలమార్చుకోలేదన్న విషయం నాకు గుర్తుకురాలేదు. నే నతడి కుర్చీపైన కన్నేసి వున్నాననీ,




యెప్పుడో గ్గద్దలా తన్నుకు పోతాననీ అతడి అనుమానం. అతడి అనుమానం పోగొట్టాలంటే తలమార్చుకోక తప్పదు.

బుట్టలోంచీ వోపూవు తీసి వినయంగా అతడికిచ్చాను.

అత్తరువాసనలో అతడు మైమరచిన సమయంలో నా తల పైనున్న సింహం తల బుట్టలోకి చేరిపోయింది. యిప్పుడు నా మొండెంపైన నక్కతల కుదురుగ, కొంటెగా కులుకుతోంది.

మత్తులోంచీ తేరుకున్న తర్వాత మా ఆఫీసరు నా నక్కతలని చూసి మురిసిపోసాగాడు.

"కావాలని అప్పుడప్పుడూ జోగుతున్నానుసార్! యెప్పుడు పడితే అప్పుడు హఠాత్తుగా కళ్లు తెరిచి చూస్తూ వుంటాను. మరేం పర్వాలేదు. అందరూ సక్రమంగానే పని చేసుకుపోతున్నారు....." అని చెప్పాను.

యీసారి నా మాటల్ని పూర్తిగా నమ్మినట్టే కనిపించాడు అతను. తృప్తిగా నిట్టూర్చి, అతడినుంచీ వీడ్కోలు తీసుకుని బయటపడ్డాను.

ఆఫీసు టయుమై పోయాక కూడా కాస్సేపు కుర్చీలోంచీ కదలలేదు నేను. ఆ ఫైలూ, యీ ఫైలూ తిప్పుతున్నట్టుగా నటిస్తూ వుండిపోయాను. నా కింది వుద్యోగులందరూ గోడ గడియారం కేసి బిక్కచూపులు సారించసాగారు. నేను సీటులో వున్నంతవరకూ, సమయం గడచిపోయినా, వాళ్లు బయటికి కదలగూడదు. అలా తర్ఫీదు చేశాను వాళ్లని. అలా కాస్సేపు గడచిన తర్వాత, యిక యీ రోజుకు వాళ్ల నేడిపించింది చాలనుకుని ఆఫీసు నుంచీ వచ్చేశాను.

నేను లలితకళా సమితి కార్యాలయున్ని చేరుకునే సరికి బాగా చీకటి పడిపోయింది. ఆ సరికే సంస్థ సభ్యులందరూ ఆసీనులై పోయివున్నారు. సంస్థ కార్యనిర్వాహక వర్గాన్ని యెన్నుకునే సంరంభంలో వున్నారందరూ. సంస్థ బాగోగుల్ని గురించి వో పెద్దమనిషి- వూళ్లో వ్రేళ్లపైన లెక్కపెట్టగలిగిన కొద్దిమంది పెద్ద ధనవంతుల్లో ఆయనొకడు- వుపన్యసిస్తున్నాడు. ఆ వుపన్యాసం యెంతకూ తెగేటట్టుకనిపించడం లేదు. నా రాక నెవరూ గమనించలేదు. యెవరి ధోరణిలో వాళ్లున్నారు. చివరకు కొద్దిమంది లేచి కార్యనిర్వాహక సభ్యులుగా యెన్నకవడానికి తమకున్న అర్హతలేమిటో యేకరవు పెట్టసాగారు. వాళ్ల మాటలు కాస్సేపు వినగానే నా కొళ్లు మండిపోయింది.

విసురుగా వేదిక దగ్గరికి వెళ్లి బలవంతంగా మైకు లాక్కుని బిగ్గరగా కేకలేయడం ప్రారంభిచాను- -"ప్రతి తలమాసిన వాడూ సభ్యుడు గావాలనుకుంటే, యీ సంస్థకోసం అహరహమూ కృషిచేసిన నాలాంటి వాడే మైపోవాలి? నెల్లక్రితం యిక్కడ సంగీతోత్సవాలు జరిగినప్పుడు ఆడవాళ్లు వచ్చేద్వారం దగ్గర అందరికీ స్వాగత సత్కారాలు జరిపిం

తెలివిరానీయకే
కల కరిగి పోతాది,
ఒక్క నేనే నీకు
పెక్కు నీవులు నాకు
లేపకే నా యెంకి లేపకే నిదర,
ఈపాటి సుకము, నేనింతవరకెరగనే,

నండూరి

యెన్నెలంటే పాట
కెంత మనుసవుతాదో!
పాట సాగే శలికి
పయనమే మవుతాదో!
ఆపలేనే యెంకి యీ పడవ యిసురు!
పాడలేనే యెంకి పదములీ రొదలో!

నండూరి

దెవరు? అంతకు మునుపు జరిగిన నాట్య ప్రదర్శన సమయంలో ముఖ్య అతిథిగా వచ్చిన మంత్రిగారికి చివరిదాకా తోడుగా వున్నదెవరు? నేనేగదా! అసలు యీ ప్రాంతానికి చెందని వాళ్లంతా మెంబర్లయి పోతే మేమేంగావాలి? చూస్తూ వూరుకో వడానికి మేమేం గాజులు తొడుక్కోలేదు. కావాలంటే బలాబలాలు తేల్చుకుందాం! బస్తీమేసవాల్! మూతిపైన మీసాలున్న మగాడెవడో ముందుకురండి చూద్దాం...."

నగరంలోని యీ మేధావులకూ, లలిత కళాభిమానులకూ సరిగ్గా అర్థంగావాలంటే యెలాంటి భాష వాడాలో నాకు తెలుసు. నా అభ్యర్థిత్వానికి యికడోకా వుండదు. అవసరమైతే యింకా బలమైన, శక్తిమంత మైన భాషని మాట్లాడగలన్నేను. యీ ప్రపంచంలో నోటికున్న శక్తిని గుర్తించగల్గిన అతి కొద్దిమందిలో నే నొక్కణ్ణిగదా!


వచ్చేనెల మొదటి తేదీన జరగబోయే నాటకోత్సవాల్లో ముఖ్య అతిథిగా రాబోయే సినిమా హీరోకు స్టేజీపైన సన్మానం చేసే అవకాశం యీ సారి నా చేయి జారగూడదు. ఆ మరునాటి దినపత్రికల్లో హీరో ప్రక్కన నేను నిల్చున్న ఫోటోలే ప్రింటవ్వాలి. యీ సారి వంతునాది. కాదంటే దుమ్ము దులిపేస్తానని భీషణ ప్రతిజ్ఞాగావించి కూర్చున్నాను.

తీరా పక్కకు తిరిగి చూసేసరికి కొత్తగా వూరికి బదిలీ అయివచ్చిన ఆఫీస రొకడు నవ్వుతూ కనిపించాడు. యెంతగా బుర్రచించుకున్నా అతనే డిపార్టుమెంటుకు సంబంధించినవాడో జ్ఞాపకం రాలేదు. అయినా యే డిపార్ట్‌మెంటయితేనేం? అన్ని చోట్లా మనకు పనులుండనే వుంటాయి. ఆయనకు నమస్కారం చేసి "మీతో కాస్త పనుంది సార్! కొంచెం స్వంతపని....మీ ఆఫీసులో కలవాలి ......." అన్నాను.

అతను ముఖం ముడుచుకున్నాడు. వో సారి చుట్టూ కలయజూశాను. అందరి దృష్టీ వేదికపైనే కేంద్రీ కరించబడివుంది.

బుట్టలోంచి పువ్వొకటి తీసి ఆయనకు వినయంగా అందించాను. ఆయన మైకంలో ఆదమరచిన సమయంలో నా పైని తలని మార్చేశాను. ఆ తృటికాలంలో తలని మార్చుకోగలిగిన నా నైపుణ్యం చూస్తే నాకే ఆశ్చర్యం కలిగింది. యిప్పుడు నా భుజాలపైన వూసరవెల్లి తల ఠీవిగా వెలిగి పోతోంది.

సుషుప్తిలో సోలిపోతూ, "మీరింత




పెద్ద కళాకారుడని నాకు తెలియదు సార్! వచ్చేనెల మొదటి తేదీ సాయంకాలం నన్ను ఆఫీసులో కలవండి. మీ పని తేల్చేద్దాం......." అని హామీ యిచ్చాడతను. అంతలో వోసారి తల విదుల్చుకుని, మత్తులోంచి బయట పడ్డానికి ప్రయత్నించి, "అన్నట్టు వచ్చే నెల మొదటి తేదీ సాయంత్రం యిక్కడ వుత్సవాలున్నాయి గదా? మీరు బహుమతి ప్రధానం చేయాలి కూడాను" అంటూ ఆలోచనలో పడ్డాడు.

"మరేమీ పర్వాలేదు లెండిసార్! నాటకాలన్నీ అయిపోయాకగదా బహుమతి ప్రధానం. ఆ సరికి యిద్దరం కలిసో చ్చేద్దాం......" అన్నాను.

"అంతేలెండి! బోరు కార్యక్రమాల్ని తప్పించుకున్నట్టూ వుంటుంది......" అన్నా డాయన తలపంకిస్తూ.

లలిత కళా సమితిలో వుపన్యాసాలు సాగుతూనే వున్నాయి.

నేను లేచి బయటి కొచ్చేశాను.

వీధుల్లో వాహనాలు కారుబారు చేస్తు న్నాయి.

విశాలమైన రహదారుల్ని వదలిపెట్టి చిన్నచిన్న సందుల్లో దూరి నడవసాగాను. గమ్యం తొందరగా చేరడం ముఖ్యంగానీ, దారులేవయితేనేం చెప్పండి?

తట్టేసరికి తలుపు తెరుచుకుంది.

"రోజూ ఆల స్యంగానే రావడం! మీకు నేనంటే లక్ష్యంలేదు......" ప్రియ ముఖం ముడుచుకొంది.

"భలేదానివే ప్రియా! నీ కోసమని సగం మీటింగులో లేచి వచ్చేశాను తెలుసా?" అంటూ దాన్ని దగ్గరికి లాక్కోవడానికి చూశాను.

"దూరం.....దూరం..... మిమ్మల్నెవరు నమ్ముతారు?"

బుట్టలోంచి రెండుపూలు తీసి ముందుకు చాచాను.

వాటినోసారి వాసన చూసి "వాసనే లేదు.... నిజంగా యివి పువ్వులేనా?" అంటూ విసిరి కొట్టింది.

యెప్పుడో వుదయ మనగా చల్లిన అత్తరు. ప్రభావం తగ్గిపోయిందేమో! యెదు రుగా బల్లపైన లేత రక్తంరంగు ద్రవంతో సీసా మెరుస్తోంది. దాని మూత తీసి కొంచెం పూలపైన చిలకరించాను. తడిసిన పూలు రెండు దాని కిచ్చాను. యీ సారి వాసన చూసి "ఛీ........కంపు......." అంటూ మత్తులో మునిగిపోయింది ప్రియ. నేను గబగబా వూసరవెల్లి తలనితీసి బుట్టలో పడేసి కుక్కతల తగిలించుకున్నాను...." వోసి పిచ్చిదానా! నువ్వే నా ప్రాణం..... సంసారం దానితో; సుఖం నీతో. పెళ్లిదా నితో; ప్రేమనీతో........ బాధ్యతలు అక్కడ, హక్కులే యిక్కడ...." అని సరాగాలు మొదలు పెట్టాను. అది వో మత్తులోంచి మరో మత్తులోకి ప్రవేశించింది.

ప్రియదగ్గరి నుంచి బయట పడేస రికి వీధులన్నీ నిర్మానుష్యమై పోయాయి. బహుశా అర్థరాత్రయి వుంటుంది.

"యిదిగో విన్నే! ఆగాగు......." బాగా గడ్డంపెరిగి చినిగిన దుస్తులతో, పిచ్చివా డిలా కనిపిస్తున్న వ్యక్తి వొకడు వెంట పడ్డాడు. ఆగకుండా అడుగులు ముందుకే సారిస్తూ "నువ్వొక తలనొప్పయి పోయావు నాపాలిటికి! రోజూ యెందుకు వెంబడిస్తావు నన్ను?" అంటూ విసుక్కున్నాను.

"నీ భుజాలపైన తలెందుకో వింతగా కనిపిస్తోంది నాకు! బరువు మోస్తున్నట్టుగా కుడిభుజమెందుకో కిందికి వొంగుతోంది. నాకా సంగతేమిటోచెప్పి తర్వాత ముందుకు

కదులు" అంటూ అతను నా ముందుకొచ్చి నిల్చున్నాడు.

యిక యిలా కుదరదని బుట్టలోంచీ పువ్వొకటి తీసి వాడికిచ్చాను. అతను పువ్వులోంచీ రెండురేకులు లాగి, నోట్లో వేసుకుని నమలసాగాడు.

"వారే పిచ్చివాడా! పువ్వుల్ని వాసన చూడాలి గానీ తింటారా యెవరైనా?" అని విసుక్కున్నాను.

"అందరూ చేసే పని చెయ్యడానికి నేను సామాన్యుడిననుకుంటున్నావా? నేను కవిని సత్యాన్ని పసిగట్టడమే నా పని. అన్నట్టివి నిజం పువ్వుల్లా లేవు....... నిజం చెప్పు....."

అతడి చేతుల్లోంచీ నా చేతిని బలవంతంగా వూడ బెరుక్కుని తిరిగి చూడకుండా వొక్కపరుగున యింటికొచ్చిపడ్డాను.

పిల్లలిద్దరూ నిద్రపోతున్నారు.

నా పెళ్లాం భోజనం వడ్డించింది.

భోజనాలు ముగిశాక పడక గదిలో కొచ్చాను.

నా పెళ్లాం గిన్నెలు కడుక్కొంటోంది.

గదిలో దీపాన్ని ఆర్పేసి రహస్యపు బుట్టని మంచంకిందికి నెట్టేశాను. మామూలుగా భుజాలపైనునన్న వేరే తలతో బాటూ నిద్రపోవడమే నా కలవాటు. అయితే ఆద మరచి. నిద్రపోతున్నప్పుడెపుడో తొడుగు తొలిగిపోతుంది. అంతమాత్రానికి మోయడమెందు కనిపిస్తుంది? జ్ఞాపక మొచ్చినప్పుడల్లా తలతీసి బుట్టలో పడేసి నిద్రపోతుంటాను. యీ తలల్ని మోసీమోసీ భుజాలు కాయలు గాసిపోయాయి. వొక్కోసారి చిరాకుగా కూడా వుంటుంది కానీ తప్పదు గదా!

నా భుజాలమీంచీ కుక్కతలతీసి బుట్టలో పడేశాను.

అలవాటైన చీకటిలో రెండడుగులు ముందుకేసి "పాలు తీసుకోండి" అంటూ చేయి ముందుకు చాపింది నా పెళ్లాం.

గ్లాసునందుకుని, పాలు చప్పరిస్తూ "కొంచెం కాళ్లు పట్టవోయ్! తిరిగీతిరిగీ అలసిపోయాను" అన్నాను.

మంచాన్ని పట్టుకుని నడుస్తూ ముందుకొచ్చి గోడపట్టుకుని అలాగే మంచం చివర కూచోబోయింది నా పెళ్లాం. యింతలో గభాలున దీపం వెలిగింది.

నా పెళ్లాం చేయి స్విచ్ పైన పడటంతో దీపం వెలిగిందని వెంటనే అర్థమయింది. కావాలని తగిలించిందో, లేక పొరబాటున తగిలిందో తెలియడంలేదు.

వులిక్కిపడి యెదురుగా చూశాను.

అద్దంలో నా అసలు ప్రతిబింబం కనిపించడంతో వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి భయంతో గుండె కొట్టుకుంటున్న

> అందరూ చేసే పని చేయడానికి నేను సామాన్యుడిననుకుంటున్నావా? నేను కవిని. సత్యాన్ని పసిగట్టటమే నా పని. అన్నట్టివి నిజం పువ్వుల్లా లేవు. నిజం చెప్పు.

చప్పుడు స్పష్టంగా వినిపిస్తోంది.

గబగబా పక్కకు తిరిగి చూశాను.

నా భార్యసైతం మ్రాన్పోయి చూస్తోంది.

వణుకుతున్న చేతితోనే పాలుగ్లాసను విసిరి కొట్టాను. పెద్దగా శబ్ధంచేస్తూ అద్దం ముక్కలుముక్కలై జలజలా రాలిపడింది.

వర్షంలో తడిసిన పిల్లిపిల్లలా వణికిపోతూ పైకి లేచి "గాజు ముక్కల్ని చిమ్మేస్తాను" అంటూ ముందుకు వొంగింది నా భార్య. అంతలోనే కెవ్వుమని కేకేసి "అద్దం ముక్క గుచ్చుకున్నట్టుంది' ' అని అరుస్తూ మళ్లీ పడకపైన కూలబడిపోయింది.

నేను ముందుకు వొంగి స్విచ్ నొక్కి దీపం ఆర్పేశాను.

రక్తమొస్తున్న దాని వ్రేలు తీసి నోట్లో వుంచుకున్నాను.

చీకట్లో యిద్దరమూ అలాగే కూర్చుండిపోయాం.

బహుశా యీనా ప్రేమపూరితమైన పనితో దాని హృదయం తేలిక పడివుండవచ్చు.

నా నాలుకపైన నా పెళ్లాం రక్తం వెచ్చగా తగులుతోంది. పెదవులు ముడుచుకుని బలవంతంగా కొంత రక్తం పీల్చాను. వేడిగా, వుప్పగా రక్తం స్రవిస్తోంది. అప్పడప్పడూ అద్దాలుపగల గొట్టడమూ, అనుమానించే వాళ్ల రక్తమొకటిరెండు బొట్లయినా రుచి చూడడమూ-- యీ పద్ధతి కూడా బాగానే వుందనిపించసాగింది నాకు.

యివ్వాళెందుకో ప్రియ అనుమానంగా చూసింది. సమయం చూసి వోసారి దాని రక్తం గూడా రుచి చూసి తీరాలి. అలాగే కవిగాడి రక్తం గూడా!

# "ఆఫ్టర్ లోడింగ్"

సామాన్య ప్రజలు ఎక్కువగా భయపడేది కాన్సర్ వ్యాధిగురించే. అయితే ఈ వ్యాధిని గురించిన పరిజ్ఞానం భయాన్ని పోగొట్టగలదు. కాన్సర్ వ్యాధిగ్రస్థులు భీతావహులై, వొంటరితనంతోనూ మృత్యుభయంతోనూ కుమిలిపోతూ వుంటారు. వారికి ప్రేమా, ఓదార్పూ అందించాలి. ఆధునిక వైద్య విజ్ఞానం వారికెటూ అండగా వుండనే వుంటుంది.

కాన్సర్ చికిత్సలో ఇప్పుడు అద్భుతమైన మార్పులు వచ్చాయి. ఈవేళ మనం బ్రాకీథెరపీ (brachy therapy) అని పిలుస్తున్న రేడియేషన్ థెరపీ వంద సంవత్సరాలనుంచీ అమలులో వున్నదే. 1898 లో క్యూరీ దంపతులు రేడియం కనుక్కున్నప్పుడే దానిని కాన్సర్ చికిత్సకి వాడడం మొదలు పెట్టారు. పూర్వం రేడియం గొట్టాలను ట్యూమర్‌లో ప్రవేశపెట్టేవారు. కొంతకాలం తరువాత వాటిని తొలగించేవారు. ఆరోజుల్లో రేడియేషన్ చికిత్స చేసేటప్పుడు, డాక్టర్‌నీ ఇతర సిబ్బందినీ కూడా రేడియేషన్ ఎక్స్‌పోజర్ ప్రమాదం వుండేది. తరువాత ఈ ప్రమాద నివారణకు మార్గాలు కనుక్కున్నారు.

దీనినే "ఆఫ్టర్ లోడింగ్" (after loading) అంటారు. ఒక ప్రత్యేకమైన ఎప్లికేటర్‌తో రేడియేషన్ నీడిల్స్‌ని ట్యూమర్‌లో ప్రవేశపెడతారు. ఇలా చేయడం వలన డాక్టర్‌కూ, సిబ్బందికీ రేడియేషన్ సోకే ప్రమాదం వుండదు. ఆఫ్టర్ లోడింగ్‌ని యంత్రాలే చేస్తాయి, రిమోట్ కంట్రోల్ సహాయంతో. కాన్సర్ చికిత్సలో యిప్పుడు చాలా త్వరితగతిన అభివృద్ధి సాధింపబడుతోంది. కాన్సర్ కణాల రహస్యాలన్నింటినీ సైంటిస్ట్‌లు ఛేధించగలుగుతున్నారు. బ్రాచీథెరపీని పూర్తిగా వుపయోగించగలుగుతున్నారు.

డాక్టర్ నోరి